కొత్త బస్టాండ్ నిర్మాణం వెంటనే చేపట్టాలి

❖ తహసిల్దార్ కార్యాలయ ముందు BRS పార్టీ ధర్నా

దశ, మణుగూరు: గత BRS ప్రభుత్వంలో కొత్త బస్టాండ్ నిర్మించాలి అని మణుగూరు పట్టణంలో ఐదు కోట్ల రూపాయలు అప్పటి పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు నిధులు మంజూరు చేయించిన పనులు ఇప్పటివరకు మొదలు పెట్టకపోవటంపై తీవ్రంగా నిరసిస్తూ మణుగూరు తాసిల్దార్ కార్యాలయం ముందు బుధవారం BRS పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మణుగూరు BRS పార్టీ మండల, టౌన్ అధ్యక్షులు కుర్రి నాగేశ్వరరావు, కుంటా లక్ష్మణ్ లు మాట్లాడారు. ప్రజా అవసరాల కోసం బస్టాండ్ నిర్మాణం కోసం రూ.5 కోట్ల నిధులు మంజూరు చేపిస్తే ఇప్పటివరకు ఆ పనులు ప్రారంభించకపోవడం దారుణమన్నారు. ప్రజలకు ఉపయోగపడే పనులను రాజకీయంగా ఆలోచన చేసి నిలిపివేయడం పద్ధతికాదన్నారు. అనంతరం మణుగూరు డిటికి మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో మణుగూరు BRS పార్టీ ముఖ్య నాయకులు వట్టం రాంబాబు, ఎడ్ల శ్రీనివాస్, నర్సింహారావు, శ్రీను, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పరిష్కరమే ధ్యేయం

❖ మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి

దశ, మణుగూరు: ప్రజా సమస్యలపై పరిష్కరమే ధ్యేయం అని మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి అన్నారు. మణుగూరు సమితి సింగారంలో ప్రజాపాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామసభలో ముఖ్యఅతిథిగా మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి పాల్గొన్నారు. మణుగూరు సమితి సింగారంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సమితిసింగారం సర్పంచ్ మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, సీఐ నాగబాబు, ఎంపీఓ వెంకటేశ్వర్లు, ఏరియా హాస్పిటల్ సూపర్డెంట్ గౌరీ ప్రసాద్, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఐటీ కోర్ ఏరియాలో ఈగల్ టీం దాడులు

దశ, హైదరాబాద్: సైబరాబాద్ ఐటి కోర్ ఏరియాలో గచ్చిబౌలి, నానకరామ్ గూడలో ఈగల్ ఫోర్స్ టీం భారీ ఆపరేషన్ నిర్వహించింది. నానక్రాంగూడ డ్రగ్ డాన్ నీతు భాయ్ కోసం భారీ ఆపరేషన్ నిర్వహించింది. ఈగల్ ఫోర్స్ వస్తుందన్న సమాచారంతో డ్రగ్ డాన్ నీతూ బాయ్ పారిపోయాడు. నీతూ భాయ్ కోసం నానక్ రామ్ గూడా లో ఈగల్ ఫోర్స్ మకాం వేసింది. పెద్ద ఎత్తున ఐటి కోర్ ఏరియాలో నీతూ భాయ్, కుటుంబ సభ్యులు గంజాయి అమ్మకాలు కొనసాగిస్తున్నారు. నీతూ భాయ్ ఇంటికి గంజాయి కొనుగోలు కోసం ఐటీ ఎంప్లాయిస్ క్యూలు కట్టారు. గంజాయి కొనుగోలు కోసం నీతు భాయ్ ఇంటికి వచ్చిన 27 ఐటీ ఎంప్లాయిస్ పట్టుకున్నారు. నీతు భాయ్ దూల్పేట్ నుంచి వచ్చి ఐటి కోర్ ఏరియాలో అడ్డా పెట్టాడు. నీతూ భాయ్, కుటుంబ సభ్యులు కిరాణం షాపు మాటున గంజాయి అమ్మకాలు కొనసాగిస్తుననారు. పోలీసులు గతంలోనే నీతూ బాయ్ ని అరెస్టు చేసి పీడీ యాక్ట్ పెట్టారు. జైలు నుంచి బయటికి వచ్చి మళ్లీ గంజాయి అమ్మకాలు కొనసాగిస్తున్నాడు. ప్రతి రోజు లక్షల్లో గంజాయి అమ్మకాలు కొనసాగిస్తున్నాడు.

అత్యధిక కాలం ప్రధానిగా పనిచేసిన ఏకైక నాయకుడిగా నరేంద్ర మోదీ

❖ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు

❖ ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి మరింత దైవానుగ్రహం ఉండాలని ఆకాంక్షిస్తూ తార్నాకలోని శివాలయంలో ప్రత్యేక పూజలు

దశ ఓయూ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భారతదేశంలో అత్యధిక కాలం ప్రధానిగా పనిచేసిన ఏకైక నాయకుడిగా చరిత్ర సృష్టించారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పట్ల దైవానుగ్రహం మరింత ఉండాలని ఆయన ఆయూరారోగ్యాలతో భారతదేశానికి మరిన్ని సేవలందించాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు బుధవారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి తార్నాకలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్. రామచందర్ రావు మాట్లాడుతూ మోదీ 4.399 రోజుల పాటు, (సుమారు 12 ఏళ్లు) నిరంతరాయంగా ప్రదానమంత్రి పదవిలో కొనసాగి మాజీ ప్రధానమంత్రి జవహర్లాల్ నేహ్రూ రికార్డును అధిగమించారన్నారు. గత 12 సంవత్సరాలుగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో భారతదేశం రక్షణా రంగంలో పటిష్టంగా మారిందని, కేంద్ర ప్రభుత్వం శత్రు దేశాల కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పి కొట్టిందని చెప్పారు. అదేవిదంగా ఎకానమీలో ప్రపంచం లోనే నాలగవ స్థానంలో భారత్ నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహాంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్, వరప్రసాద్, వెంకటరమణి, నాగేశ్వర్ రెడ్డి, సారంగపాణి, బండ శివారెడ్డి, బండారి ఉపేందర్ యాదవ్, గణేష్ ముదిరాజ్, ప్రకాష్ గౌడ్, రమేష్, మధుకర్, శ్రీనివాస్ చారి, సతీష్ రెడ్డి , రామకృష్ణ, రామువర్మ తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో ప్రమాదాలపై ఫోకస్

❖ 43 బ్లాక్ స్పాట్ల గుర్తింపు.. రోడ్డు భద్రతపై "అరైవ్ అలైవ్" కార్యక్రమాలు

దశ, మల్కాజిగిరి : రాష్ట్రంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు తెలంగాణ పోలీస్ శాఖ చేపట్టిన "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో బుధవారం విస్తృత రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా జరిగిన ఈ కార్యక్రమాల్లో పోలీస్ అధికారులు, ట్రాఫిక్ విభాగం, మున్సిపల్ శాఖలు మరియు ఇతర రోడ్డు భద్రత భాగస్వామ్య శాఖలు పాల్గొన్నాయి. కమిషనరేట్ పరిధిలోని కుంట్లూర్ టీజంక్షన్, కొత్తగూడెం ఎక్స్ రోడ్ యూటర్న్, బోయిన్‌పల్లి జంక్షన్, ఉప్పల్ ఎక్స్ రోడ్స్, రాధిఫైల్ బస్ స్టాండ్ సిగ్నల్ ప్రాంతాల్లో డీసీపీ స్థాయి అధికారులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియమాల అమలు, అత్యవసర సమయంలో సహాయక చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో మొత్తం 401.8 కిలోమీటర్ల రోడ్డు నెట్‌వర్క్ ఉండగా, 2026 జనవరి నుంచి మే వరకు 1,466 రోడ్డు ప్రమాద కేసులు నమోదయ్యాయి. ఇందులో 134 ప్రాణాంతక ప్రమాదాల్లో 143 మంది మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. గత సంవత్సరాలతో పోలిస్తే ప్రమాదాలు తగ్గుముఖం పట్టినప్పటికీ, పరిస్థితి ఇంకా ఆందోళనకరంగానే ఉందని పేర్కొన్నారు. సమీక్షలో మొత్తం 43 బ్లాక్ స్పాట్లు, 20 హాట్ స్పాట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా ఎన్‌హెచ్ 65 (విజయవాడ హైవే) అత్యంత ప్రమాదకర మార్గంగా నిలిచింది. ఈ ఏడాది మే వరకు ఈ మార్గంలోనే 259 ప్రమాదాలు చోటుచేసుకుని 17 మంది మృతి చెందారు. రోడ్డు భద్రత మెరుగుదలకు బ్లాక్ స్పాట్ల సవరణ, హెచ్చరిక బోర్డుల ఏర్పాటు, రోడ్డు ఇంజినీరింగ్ మెరుగుదలలు, హైవే పెట్రోలింగ్ బలోపేతం, ప్రత్యేక పార్కింగ్ సదుపాయాలు, ట్రాఫిక్ అమలు చర్యలను మరింత కఠినతరం చేయనున్నట్లు కమిషనరేట్ వెల్లడించింది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ప్రజలను ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్లు, సీట్ బెల్టు ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. ప్రమాద బాధితులకు గోల్డెన్ అవర్ సమయంలో సహాయం చేసే వారికి "రాహ్‌వీర్ (గుడ్ సమారిటన్)" పథకం కింద రూ.25 వేల నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు. అలాగే హిట్ అండ్ రన్ ప్రమాదాల్లో మరణించిన వారి కుటుంబాలకు రూ.2 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.50 వేల పరిహారం అందించే సొలాటియం పథకం అమలులో ఉందని అధికారులు పేర్కొన్నారు.

2016 దివ్యాంగుల హక్కుల చట్టం పార్లమెంట్లో మాట్లాడి చట్టం అమలు చేపిస్తా

భువనగిరి ఎంపీ దామల కిరణ్ కుమార్ రెడ్డి

దశ ఓయూ: దివ్యాంగుల కోసం 2016 చట్టం అమల్లోకొచ్చి 10 సంవత్సరాలు పూర్తి అయిన అందులో ఉన్న ఒక్క అంశం కూడా అమలు కాకపోవడంతో దేశవ్యాప్తంగా దివ్యాంగులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్ని సమస్యలు పరిష్కారం కావడానికి ఏర్పడిన చట్టం 2016 దివ్యాంగుల చట్టం అమలు కాకపోవడంతో పార్లమెంట్లో దివ్యాంగుల పక్షాన మాట్లాడి చట్టం అమలుకు కృషి చేస్తానని అందులో అంశాలపై భవిష్యత్తులో దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి దివ్యాంగుల విశ్వ విద్యాలయాల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎన్ అశోక్ హైదరాబాదులో గచ్చిబౌలి తన నివాసానికి పిలిపించుకొని వికలాంగుల అంశాలపై చర్చించి డాక్టర్ అశోక్ రూపొందించిన దివ్యాంగుల ముఖ్యాంశాలు దివ్యాంగుల 2016 చట్టం పుస్తకాన్ని చూసి ప్రతి అంశాన్ని చదివి అధ్యయనం చేసిన ఎంపి పార్లమెంట్లో మాట్లాడి చట్టం అమలుకై కృషి చేస్తానని తెలియజేశారు ఈ కార్యక్రమంలో మాజీ డిసిసి ప్రధాన కార్యదర్శి మాజీ ఎంపీటీసీ తాటిపాముల శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నవ లిమిటెడ్ ఎదుట సిఐటియు ధర్నా

- పోలీసుల రంగప్రవేశంతో సమసిన వివాదం

దశ, పాల్వంచ: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని నవభారత్ నవ లిమిటెడ్‌లో కార్మికుల హక్కులను యాజమాన్యం కాలరాస్తోందని ఆరోపిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. కర్మాగారంలో కార్మికులకు పని భద్రత, గ్రాడ్యూటీ సౌకర్యం తొలగించారని, కార్మికుల ను వేధింపులకు గురిచేస్తున్నారని సిఐటియు జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కార్మికులతో కలిసి కర్మాగారం ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించి కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు ఊరుకునేది లేదని బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో పాల్వంచ టౌన్ ఎస్ఐ తోట నాగరాజు సంఘటన స్థలానికి చేరుకొని యాజమాన్యంతో చర్చలు నిర్వహించారు. ఈ క్రమంలో కార్మికులు యాజమాన్యంపై తిరగబడ్డారు. దీంతో సాధ్యమైనంత త్వరగా సమస్యను పరిష్కరించాలని లేకపోతే కర్మాగారంలో మూకుమ్మడి సమ్మెకు పూనుకుంటామని హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ రవికుమార్, సీనియర్ నాయకులు ఎం.వి అప్పా రావు, సిపిఎం పట్టణ కార్యదర్శి తులసిరామ్, సహాయ కార్యదర్శి సత్య, వింజరాములు, వి సత్యవాణి, ఎస్కే నిరంజన్ , కాంతి, గోపాల్, సుధీర్, సురేష్, ఏ యాకోబు, గుర్రం రాములు , కవి తకుమారి, ఎండి యాకోబు తదితరులు పాల్గొన్నారు.

మైహోమ్ సిమెంట్స్‌పై నిబంధనల ఉల్లంఘన ఆరోపణలు

❖ మైనింగ్ లీజు భూమిలో ప్రైవేట్ రైల్వే ట్రాక్ నిర్మాణమా?

దశ, నల్గొండ: ప్రభుత్వ నిబంధనల మేరకు మాత్రమే పరిశ్రమలు కార్యకలాపాలు నిర్వహించాల్సి ఉండగా, మేళ్లచెరువు మండలంలోని మైహోమ్ (మహా) సిమెంట్స్ పరిశ్రమపై పర్యావరణ, మైనింగ్ నిబంధనల ఉల్లంఘన ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సున్నపురాయి మైనింగ్ కోసం ప్రభుత్వం లీజుకు ఇచ్చిన భూమిలోనే సంస్థ ప్రైవేట్ రైల్వే ట్రాక్ నిర్మించిందనే విమర్శలు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

స్థానికుల కథనం ప్రకారం, మైనింగ్ కార్యకలాపాలకు మాత్రమే వినియోగించాల్సిన లీజు భూమిలో భారీ నిర్మాణాలు చేపట్టడంతో పాటు, రైల్వే ట్రాక్ ఏర్పాటు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా, మైనింగ్ లీజు భూములను అక్రమంగా విక్రయిస్తున్నారనే ఆరోపణలు కూడా వెలువడుతున్నాయి.

మేళ్లచెరువు మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 874లో మొత్తం 567 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, అందులో 141.644 హెక్టార్ల భూమిని 1983లో సున్నపురాయి మైనింగ్ కోసం అప్పటి దేవి సిమెంట్స్‌కు ప్రభుత్వం లీజుకు ఇచ్చింది. ప్రస్తుతం ఈ సంస్థ మైహోమ్ సిమెంట్స్‌గా కొనసాగుతోంది. 2023లో పర్యావరణ అనుమతులు పునరుద్ధరించుకున్న సంస్థ, అనుమతుల షరతులకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కేంద్ర అటవీ, పర్యావరణ మరియు వాతావరణ మార్పు శాఖ నిబంధనల ప్రకారం మైనింగ్ భూమిని కేవలం తవ్వకాల కోసమే వినియోగించాల్సి ఉంటుంది. ఇతర నిర్మాణాలు చేపట్టాలంటే ప్రత్యేక పర్యావరణ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే అలాంటి అనుమతులు లేకుండానే ప్రైవేట్ రైల్వే ట్రాక్ నిర్మించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా సర్వే నెంబర్ 1057లోని పట్టా భూముల్లో రైల్వే ట్రాక్‌తో పాటు లోడింగ్, అన్‌లోడింగ్ పాయింట్లు నిర్మించినప్పటికీ గ్రామపంచాయతీ అనుమతులు కూడా తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. 2015లో నిర్మించిన ఈ రైల్వే లోడింగ్ పాయింట్‌కు ఇప్పటివరకు పన్నులు కూడా చెల్లించలేదని సమాచారం. మైనింగ్ కార్యకలాపాలపై ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్, పర్యావరణ శాఖలు పర్యవేక్షణ చేస్తున్నప్పటికీ, రైల్వే ట్రాక్ నిర్మాణంపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. బహిరంగంగా నిబంధనలు ఉల్లంఘించినప్పటికీ సంబంధిత శాఖలు స్పందించకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్‌సీసీ తెలంగాణ ప్రాంతీయ ఛైర్మన్‌గా రేవ్. డా. అనిల్ కిరణ్ కుమార్

దశ, ఓయూ: నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ (ఎన్‌సీసీ) తెలంగాణ ప్రాంతీయ ఛైర్మన్‌గా రేవ్. డా. అనిల్ కిరణ్ కుమార్‌ను నియమించినట్లు రాష్ట్ర కమిటీ ప్రకటించింది. రాష్ట్ర అధ్యక్షులు బిషప్ మద్దెల సంజయ్ ఆనంద్, ప్రధాన కార్యదర్శి బిషప్ బక్క ఎలియా సమక్షంలో నియామకాన్ని అధికారికంగా వెల్లడించారు. క్రైస్తవ సమాజ అభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాలు, సంఘాల ఐక్యత కోసం చేసిన సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అనిల్ కిరణ్ కుమార్‌కు పలువురు నాయకులు, పాస్టర్లు శుభాకాంక్షలు తెలిపారు.

హబ్సిగూడలో జనావాసాల మధ్య కాలేజ్ అనే ఏర్పాటు చేయవద్దని స్థానికుల ఆందోళన

❖ ఆందోళన చేస్తున్న స్థానిక కాలనీవాసులను అరెస్టు చేసిన పోలీసులు

దశ, ఓయూ: హబ్సిగూడ డివిజన్ కాకతీయ నగర్ వీధి నెంబర్ 3 లో ప్రైవేట్ కళాశాల ఏర్పాటును వ్యతిరేకిస్తూ కాలనీ వాసులు చేపట్టిన నిరసన కార్యక్రమం ఉద్రిక్తతకు దారి తీసింది. కళాశాలకు వచ్చిన విద్యార్థులను, తల్లిదండ్రులను కాలనీ వాసులు అడ్డగించడంతో కళాశాల యాజమాన్యానికి కాలనీవాసులకు వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు నిరసనకారులను అదుపులోకి తీసుకొని ఓయూ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ హబ్సిగూడలోని కాకతీయ నగర్ లో జనావాసాల మధ్య నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన చైతన్య కళాశాలతో స్థానికులు నిత్యం ట్రాఫిక్ జాము సౌండ్ పొల్యూషన్ వంటి సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తదని, కాలనీ వాసుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కళాశాలను తక్షణమే తరలించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాకతీయ నగర్ అసోసియేషన్ సభ్యులు గడ్డం రవి, రఘుపతి గౌడ్, బొక్క జైపాల్ రెడ్డి, మనీష్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, నితిన్ అగర్వాల్, కౌశిక్ రెడ్డి రమాకాంత్ రెడ్డి వెంకటేశ్వర్లు, శ్రీధర్, మధుసూదన్ రెడ్, రామచంద్ర రెడ్డి, సుగుణకర్ రెడ్డి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

గిన్నిస్ వరల్డ్ రికార్డులో సాధించిన శాంతినగర్ వాసులు

❖ ఇజ్రాయిల్, నాని, రోని రొనాల్డ్

❖ హల్లెల్ మ్యూజిక్ స్కూల్ ఆధ్వర్యంలో ఘన సన్మానం

దశ, అబ్దుల్లాపూర్ మెట్ : ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన మైలురాయిని అధిగమించి సంగీతంలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో పెద్దఅంబర్ పేట్ శాంతినగర్ కాలనీకి చెందిన ఇజ్రాయిల్, నాని, రోని రొనాల్డ్ లు చోటు దక్కించుకున్నారు. వీరిని గత నెల 29న గచ్చిబౌలిలోని 'విక్టరీ ఆడిటోరియంలో నిర్వహించిన గిన్నిస్ 'అచీవర్స్ మీట్' వేదిక పై ఘనంగా సన్మానించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 2న హైదరాబాద్‌లో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధుల సమక్షంలో 'హల్లెల్ మ్యూజిక్ స్కూల్' ఒక బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహించింది. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 22 దేశాల నుండి తరలివచ్చిన 2వేల మంది కీబోర్డ్ వాయిద్యకారులు ఒకే వేదికపై ఒకే లయతో గంటపాటు ఏకధాటిగా (ఆగకుండా) కీబోర్డ్ వాయించి సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పారు. ఈ అద్భుతమైన ప్రదర్శనలో అత్యంత ప్రతిభను కనబరిచిన 777 మంది విద్యార్థులను గిన్నిస్ రికార్డు సాధకులుగా ఎంపిక చేశారు. గచ్చిబౌలిలో జరిగిన అచీవర్స్ మీట్ కార్యక్రమంలో, హల్లెల్ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకులు అగస్టిన్ దండింగి ముఖ్య అతిథిగా విచ్చేసి, ఎంపికైన ప్రతిభా వంతులకు గిన్నిస్ వరల్డ్ రికార్డు అధికారిక సర్టిఫికేట్లను అందజేసి శాలువాలతో సత్కరించి అభినందించారు.

ఈ అంతర్జాతీయ స్థాయి రికార్డులో పెద్దఅంబర్ పేట్ శాంతినగర్ కాలనీకి చెందిన ఇజ్రాయిల్, నాని, రోని రొనాల్డ్ తమ అసాధారణ కీబోర్డ్ ప్రతిభను చాటి గిన్నిస్ రికార్డులో చోటు సంపాదించుకున్నారు. చిన్న వయస్సులోనే అంతర్జాతీయ వేదికపై శాంతినగర్ కాలనీ పేరును ప్రఖ్యాతిని తీసుకొచ్చిన ఇజ్రాయిల్, నాని, రోని రొనాల్డ్ లను వారి తల్లిదండ్రులు, కాలనీ పెద్దలు, పాఠశాల యాజమాన్యం, గ్రామ యువత ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే రోజుల్లో వీరు సంగీత ప్రపంచంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ ఎన్నికల ప్రక్రియ

❖ పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

దశ, మణుగూరు: ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ ఎన్నికల ప్రక్రియను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవాలని BJP చేస్తున్న ప్రయత్నాలు దేశ ప్రజలు గమనిస్తున్నారని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో మీనాక్షి నటరాజన్ రాజ్యసభకు నామినేషన్ ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా వివరణ కోరే అవకాశం కల్పించకుండా తిరస్కరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తిగా విరుద్ధమని అని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం, ప్రతి పౌరుడి బాధ్యత అని , కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న నియంతృత్వ దోరణలను కాంగ్రెస్ పార్టీ ప్రజల తరపున నిరంతరం ప్రశ్నిస్తూనే ఉంటుందని శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు స్పష్టం చేస్తూ పత్రిక ప్రకటనలో వెల్లడించారు.

కాంస్య పతకం సాధించిన కానిస్టేబుల్‌ను అభినందించిన ఎస్పీ



దశ, కొత్తగూడెం: పవర్ లిఫ్టింగ్ విభాగంలో కాంస్య పతకం సాధించిన ఏఆర్ కానిస్టేబుల్ వంశీని బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అభినందించారు. హర్యానా లోని కర్నాల్ జిల్లా, మధుబన్ లో గల వచ్ఛేర్ స్టేడియంలో నిర్వహించిన ప్రతిష్టాత్మక "3వ ఆల్ ఇండియా పోలీస్ వెయిట్‌లిఫ్టింగ్ క్లస్టర్ చాంపియన్‌షిప్" పోటీలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏఆర్ కానిస్టేబుల్ వి.వంశీ కృష్ణ 59 కేజీల పవర్‌లిఫ్టింగ్ విభాగంలో ప్రతిభ చాటి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్న వంశీకృష్ణను అభినందించి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ చెన్నూరు శ్రీనివాస్, ఏఆర్ ఆర్ఐ బొల్లం రవి పాల్గొన్నారు.

ప్రమాద బీమా పాలసీలు తీసుకోవాలి: సీఐ వెంకటేశ్వర

దశ, పినపాక: పొట్లపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన-99 డేస్ ప్లాన్ గ్రామసభలో ఇతర అధికారులతో కలిసి సీఐ వెంకటేశ్వర రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అయితే అనుకోని ప్రమాదాలు సంభవించినప్పుడు కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా పోస్టల్, ఎస్‌బీఐ తదితర సంస్థల్లో తక్కువ వార్షిక చందాతో లభించే ప్రమాద బీమా పాలసీలు తీసుకోవాలని సూచించారు. కుటుంబ పెద్దకు ఏదైనా ప్రమాదం జరిగితే అతనిపై ఆధారపడిన పిల్లలు, వృద్ధులకు ఆర్థిక భరోసా కల్పించడంలో ఇటువంటి బీమా పథకాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గ్రామస్థులు బీమా పథకాలపై అవగాహన పెంచుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సురేష్ రోడ్డు ప్రమాదాల పై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదంలో మరణించడం అంటే ఒక కుటుంబం రోడ్డు మీద పడటం అని తెలిపారు.

ఐలాపురం బ్రిడ్జి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

❖ ఇద్దరు యువకులు మృతి

దశ, పినపాక: పినపాక మండలం ఐలాపురం బ్రిడ్జి సమీపంలో బుధవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు టిప్పర్ లారీని ఢీకొన్నారు . ఈ ప్రమాదంలో మణుగూరు సమీపంలోని కమలాపురం గ్రామానికి చెందిన దర్రాజు కిషోర్ అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడు ప్రశాంత్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిసింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు సహాయక చర్యలు చేపట్టి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనపై ఏడూళ్లబయ్యారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేశ అభివృద్ధే నరేంద్రమోడీ ధ్యేయం

❖ BJP భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

❖ మోదీ చారిత్రాత్మక పాలనకు గుర్తుగా భద్రాచలంలో ప్రత్యేక పూజలు

దశ, భద్రాచలం: దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు వరుసగా 4399 రోజులపాటు దేశానికి నాయకత్వం వహిస్తూ భారత రాజకీయ చరిత్రలో అత్యంత సుదీర్ఘకాలం నిరంతరాయంగా సేవలందించిన ఎన్నికైన ప్రధానమంత్రిగా చారిత్రాత్మక మైలురాయిని అధిగమించిన సందర్భంగా భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి ఆలయంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, ప్రపంచ వేదికపై భారతదేశ ప్రతిష్ఠ మరింత పెరగాలని ఆకాంక్షిస్తూ నాయకులు స్వామివారిని దర్శించుకొని ఆశీర్వాదాలు తీసుకున్నారు.

ఈ సందర్భంగా తెలంగాణ టూరిజం హోటల్లో నిర్వహించిన ప్రెస్ మీట్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీజేపీ అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, స్వాతంత్ర్యానంతర భారత రాజకీయ చరిత్రలో నరేంద్ర మోదీ గారి పాలన ఒక సువర్ణ అధ్యాయంగా నిలిచిందన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి "సబ్కా సాథ్, సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్" లక్ష్యంతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వ హయాంలో దేశవ్యాప్తంగా 80 కోట్ల మందికి పైగా ప్రజలకు ఉచిత ఆహార ధాన్యాల పంపిణీ, 4 కోట్లకు పైగా పక్కా ఇళ్ల నిర్మాణం, 15 కోట్లకు పైగా ఇంటింటికీ తాగునీటి కనెక్షన్లు, 10 కోట్లకు పైగా ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు, 55 కోట్లకు పైగా జనధన్ బ్యాంకు ఖాతాలు, 11 కోట్లకు పైగా మరుగుదొడ్ల నిర్మాణం, 14 కోట్లకు పైగా ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులు, 11 కోట్ల మంది రైతులకు పీఎం కిసాన్ ద్వారా ఆర్థిక సహాయం అందించడం వంటి కార్యక్రమాలు సామాన్య ప్రజల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చాయని తెలిపారు. ప్రపంచ దేశాల మధ్య భారతదేశ ప్రతిష్ఠను మరింత పెంచుతూ, 2047 నాటికి "వికసిత భారత్" లక్ష్య సాధన దిశగా మోదీ గారు కృషి చేస్తున్నారని, ఆయనకు భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించి మరింత కాలం దేశానికి సేవ చేసే అవకాశం కల్పించాలని కోరుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు కుంజా ధర్మా, ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా సంతోష్, బీజేపీ సీనియర్ నాయకులు కురిచేటి రామచంద్రమూర్తి, జిల్లా కౌన్సిల్ సభ్యులు నిడదవోలు నాగబాబు, జిల్లా సీనియర్ నాయకులు ములిశెట్టి రాంమోహన్ రావు, బోడ సత్యనారాయణ, చెల్లుబోయిన వెంకన్న, ముత్యాల చంద్రశేఖర్, పీసీ కేశవ్, దేవరపల్లి వెంకటేశ్వర్లు, అల్లాడి వెంకట సుబ్బయ్య, జీవా తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభల్లో పారదర్శకత, జవాబుదారీతనం ముఖ్యం

❖ ఎంపీడీవో సంకీర్త్, ఎంపీఓ శ్రీనివాసరావు

దశ, పినపాక: గ్రామాల అభివృద్ధికి గ్రామసభలు కీలక వేదికలని, వాటి నిర్వహణలో పారదర్శకత, జవాబు దారీతనం తప్పనిసరిగా ఉండాలని పినపాక ఎంపీడీవో సంకీర్త్, ఎంపీఓ శ్రీనివాసరావులు అన్నారు. మండలంలోని ఈ బయ్యారం, గడ్డంపల్లి, పొట్లపల్లి, మల్లారం, భూపాలపట్నం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయా సర్పంచ్ ల అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభల్లో మాట్లాడారు.గ్రామ ప్రజల సమస్యలు, అవసరాలు గ్రామసభల ద్వారానే అధికారుల దృష్టికి వస్తాయని, వాటి పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, గ్రామాభివృద్ధి పనుల పురోగతి, ప్రజల అభిప్రాయాల సేకరణలో గ్రామసభలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రజలు గ్రామసభల్లో చురుకుగా పాల్గొని తమ సమస్యలను నిర్భయంగా వెల్లడించాలని సూచించారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, గ్రామాభివృద్ధికి అందరి సహకారం అవసరమని పేర్కొన్నారు. ఈ గ్రామ సభల్లో తాసిల్దార్ శ్రీనివాసరెడ్డి , వెటర్నరీ వైద్యులు ఉజ్వల, అగ్రికల్చర్, ఇరిగేషన్, విద్యుత్ శాఖ, మిషన్ భగీరథ, తోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొని తమ తమ శాఖల పరిధిలో ప్రగతి నివేదికలు చదివి వినిపించారు.

అలాగే సమస్యలు ఉంటే తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో బయ్యారం సర్పంచ్ చందర్రావు, పొట్లపల్లి సర్పంచ్ సమ్మయ్య, గడ్డంపల్లి సర్పంచ్ కృష్ణవేణి, భూపాలపట్నం సర్పంచ్ స్వప్న, మల్లారం సర్పంచ్ సాంబశివరావు, ఆయా గ్రామ పంచాయతీల సెక్రటరీలు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డుభద్రతప్రతిఒక్కరిబాధ్యత

❖ ఖమ్మం పోలీస్ కమీషనర్ సునిల్‌దత్

దశ, ఖమ్మం: రోడ్డు భద్రత అనేది ప్రతి ఒక్కరి ప్రాణాలకు రక్షణగా నిలిచే అత్యవసరమైన అంశమని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కూసుమంచి మండలం నాయకులగూడెం గ్రామంలోని పీవీ ఫంక్షన్ హాల్లో బుధవారం నిర్వహించిన గ్రామసభలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ...రోడ్డుపై ప్రతి ఒక్కరి బాధ్యతాయుతమైన ప్రవర్తన ఎంతో మంది కుటుంబాల జీవితాలను కాపాడుతుందన్నారు.

ప్రయాణికులందరూ సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవడానికి ఇది దోహదపడుతుందన్నారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం, వాహనం నడిపేటప్పుడు ఏకాగ్రత వహించడం, సరైన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఎన్నో ప్రాణాంతక ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. ద్విచక్ర వాహనం నడిపే టప్పుడు ప్రతి ఒక్కరూ ఐఎస్ఐ ప్రమాణాలు కలిగిన హెల్మెట్ ను ధరించాలని, కారులో ప్రయాణించేటప్పుడు డ్రైవర్‌తో పాటు పక్కన కూర్చున్న వారు, వెనుక కూర్చునే వారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ పెట్టుకోవాలన్నారు. వాహనాన్ని పరిమిత వేగంతో మాత్రమే నడపాలని, వేగం పెరిగే కొద్దీ ప్రమాదాలు జరిగే అవకాశం, వాటి తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుందన్నారు. మద్యం, మత్తు పదార్థాలను సేవించి ఎప్పుడూ వాహనం నడపకూడదన్నారు. ఇది మీ ప్రాణాలకే కాక ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదమన్నారు. డ్రైవింగ్ చేస్తున్నప్పుడు మొబైల్ ఫోన్లలో మాట్లాడటం, మెసేజ్ చేయడం వంటివి చేస్తే మీ ఏకాగ్రతను దెబ్బతీసే ప్రమాదం ఉందన్నారు. రోడ్డుపై ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్, బోర్డులు, సూచికలను కచ్చితంగా పాటించాలని, రోడ్డు దాటేటప్పుడు ఎల్లప్పుడూ జీబ్రా క్రాసింగ్ ఉపయోగించాలన్నారు.

వాహనదారులు సైతం పాదచారులకు ప్రాధాన్యత ఇవ్వాలని, డ్రైవింగ్ లైసెన్స్, వాహనం రిజిస్ట్రేషన్ పత్రాలు ఇన్సూరెన్స్, పీయూసీ సర్టిఫికేట్ వెంట ఉంచు కోవాలన్నారు. ఇటీవల కూసుమంచి మండలంలో యాక్సిడెంట్ కు గురైన బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి సలహాలు సూచనలు ప్రజలకు తెలియజేశారు. అదేవిదంగా ప్రమాదానికి గురై చనిపోయిన బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ధర్మ తండా చెందిన జర్పుల లలిత కుమారుడు సందీప్ యాక్సిడెంట్ గురై చనిపోయిన బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

❖ భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

దశ, కొత్తగూడెం: సమాజంలో ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు కోరారు. బుధవారం ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా జూలూరుపాడులో నిర్వహించిన రోడ్ సేఫ్టీ గ్రామసభలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత విషయణలో నియమ నిబంధనలు పాటించని వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా ప్రతి గ్రామంలో, ప్రతి కూడలివద్ద, వ్యాపార సంస్థల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీసీ కెమెరాల ప్రాముఖ్యతను వివరించారు. దీంతోపాటు సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం, ట్రాఫిక్ నిబంధనల పాటింపు ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. గంజాయి సరఫరా, వినియోగంపై సమాచారం అందించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులను, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పెంచిన పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలి

❖ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

దశ, కొత్తగూడెం: కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. బుధవారం కొత్తగూడెం కలెక్టరేట్ ముందు సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆయిల్, గ్యాస్ ధరలు కేంద్ర ప్రభుత్వం పెంచడం మూలంగా సామాన్య ప్రజలుకు భారంగా మారిందన్నారు. డీజిల్ ధరలు పెంచడం మూలంగా నిత్యవసర సరుకుల ధరలు భారీగా పెరిగాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు పేదవాళ్ల పక్షాన ఆలోచన చేసి పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించే వరకు సీపీఐ పార్టీ తరుపున పోరాటాలు ఆపేదిలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాష, కొత్తగూడెం కార్పోరేషన్ మేయర్ మూడ్ నగేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, మండల కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రచారం చేయాలి

❖ ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న

దశ, కొత్తగూడెం: కొత్తగూడెంలోని కొత్తగూడెం క్లబ్ లో డీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి తోట దేవి ప్రసన్న అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి బూత్ లెవల్ ఏజెంట్ల (BLA) శిక్షణా శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై BLA లకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా MP రఘురామిరెడ్డి మాట్లాడుతూ, "ఢిల్లీలో రాహుల్ గాంధీ, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి చేస్తున్న పోరాటం బూత్ స్థాయిలో గెలిస్తేనే సార్థకం అవుతుంది. ఒక్కో BLA అంటే ఒక్కో సైనికుడు. ప్రతిపక్షాల కుట్రలు, దొంగ ఓట్లు, డబ్బు ప్రలోభాలను మీరు తిప్పికొట్టాలి. 6 గ్యారంటీల అమలును ప్రజల్లోకి తీసుకెళ్లి మళ్లీ కాంగ్రెస్ జెండా ఎగరేయాలి" అని పిలుపునిచ్చారు. డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న మాట్లాడుతూ, "SIR ప్రక్రియ పూర్తయ్యే వరకు BLA లు అప్రమత్తంగా ఉండాలి.

18 ఏళ్లు నిండిన కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి తొలగింపు, అడ్రస్ మార్పులు ఫారం6, 7, 8 ద్వారా వెంటనే చేయించాలి. BLO లతో సమన్వయం చేసుకొని బూత్‌లో 100% ఓటింగ్ జరిగేలా చూడాలి. పోలింగ్ రోజు ఏజెంట్‌గా మీరు చూపే చొరవే మన గెలుపును నిర్ణయిస్తుంది"

అని సూచించారు. "ఇందిరమ్మ ఇళ్లు, రైతు రుణమాఫీ, మహాలక్ష్మి పథకం లబ్ధిదారుల ఇంటికి వెళ్లి వారిని కలవండి. వారి ఓటు కాంగ్రెస్‌కే పడేలా చూడడం బిఎల్ఏల వంతు అని అన్నారు. మీకు ఏ సమస్య వచ్చినా డీసీసీ నేరుగా అండగా ఉంటుంది" అని జిల్లా అధ్యక్షురాలు భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంటు ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి, డిసిసి అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న , టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగ సీతారాములు, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, కొత్వాల్ శీను, ఆళ్ళ మురళి, ఊకంటి గోపాలరావు, మండే వీర హనుమంతరావు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చీకటి కార్తీక్, అర్జున్ రావు, అంతోటి పాల్, ఎం ప్రసాద్ బాబు, మంద హనుమంతరావు, కోదుమూరి శ్రీనివాసరావు, రాజేంద్రప్రసాద్, నాగార్జున శ్రీనివాస్ రెడ్డి, చింతలపూడి శేఖర్, రంగారావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గద్దెల రమేష్, అబ్జర్వర్ రాథోడ్ డిసిసి జిల్లా కమిటీ సభ్యులు, మండల అధ్యక్షులు, కార్పొరేటర్లు, సర్పంచులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు.